www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 26 | మే | 2026
పేజీలు : 8

## కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి




తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ

2 లో

# కార్పోరేషన్‌లో అడ్డగోలు అనుమతులు..!




### -యజమానులు, ఇంజనీర్ల మాయాజాలం
### -కార్పోరేషన్ ఆదాయానికి భారీ గండి

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మం కార్పోరేషన్‌లో పైరవీల పర్వం కొనసాగుతుంది. అధికారులు యధాశక్తి సహకరిస్తుండడంతో అక్రమాలకు అంతు లేకుండాపోతుంది. నీ పని చేస్తా నాకెం చేస్తావన్న రీతిలో అధికారులు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే అదునుగా కొందరు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ కార్పోరేషన్ నుంచి అక్రమ పద్ధతిలో అనుమతులు పొందుతున్నారు. కొందరు లైసెన్స్ ఇంజనీర్లు, భవన, భూ యజమానులు కలిసి అనుమతులను అక్రమ పద్ధతిలో పొందుతున్నారు. భవన నిర్మాణ అనుమతి కోరే సమయంలో భూ యజమాని, లైసెన్స్ ఇంజనీర్ సమర్పించే ధృవపత్రాలను ఆయుధంగా వాడుకుంటున్నారు. భవన విస్తీర్ణం తక్కువగా చూపిస్తూ మున్సిపాలిటీకి చెల్లించాల్సిన పన్నులను ఎగవేస్తున్నారు. కొందరైతే ఖాళీ స్థలం

మిగతా 2లో..



### సిఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే కూనంనేని, సిపిఐ రాష్ట్ర బృందం



2 లో

### రామారావు హత్య కేసు నిందితులను అరెస్టు చేయండి



2 లో

### ఆగస్టు 15 లోపు యాతాలకుంట టన్నెల్ లైనింగ్ పనులు పూర్తి చేయాలి



2 లో

## అగ్నికి ఆహుతైన పామాయిల్ తోటలు





**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని గోళ్లపాడు గ్రామంలో ప్రమాదవశాత్తూ భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకొని, పామయిల్ తోటలు సోమవారం మంటలలో కాలిపోయాయి. రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. శాబాద్ శ్రీనివాస్‌రెడ్డి, శాబాద్ హనుమంతురెడ్డి,

మిగతా 2లో..

## వానాకాలం సాగుకు సన్నద్ధం..!

- ప్రణాళిక సిద్ధం చేసిన అధికారులు
- 6 లక్షల 37,800 ఎకరాల సాగు అంచనాలు
- అందుబాటులోనికి రాని యాప్
- నెలఖారు నాటికి యాప్ అందుబాటులోకి వస్తుంది : ఏడి

సెంటర్‌స్ప్రెడ్



# కార్పోరేషన్‌లో అడ్డగోలు అనుమతులు..!

**(మొదటిపేజీ తరువాయి)** వదలకుండా వాస్తవ నిర్మాణం ఒకవిధంగా ఉంటే మరోక విధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి భవన నిర్మాణ ప్లాన్‌ను అప్‌లోడ్ చేసి అనుమతులు పొందుతున్నారు. కార్పోరేషన్‌లో భవన నిర్మాణ అనుమతులపై విచారణ జరిపితే వాస్తవ నిర్మాణానికి అనుమతులు కోరుతూ కార్పోరేషన్‌లో సమర్పించిన ధృవపత్రాలకు మధ్య వ్యత్యాసాన్ని తెలుసుకోవచ్చు. తెలంగాణ మున్సిపల్ చట్టం ప్రకారం భవన నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తు చేసేటప్పుడు ఇంజనీర్ , భూ లేదా భవన యజమాని సెల్ఫ్ డిక్లరేషన్ సమర్పించాలి. అందులో సమాచారం తప్పని తేలితే క్రిమినల్ చర్యలు తీసుకునే అవకాశం ఉంది. దీనితో పాటు ఏ సమయంలోనైనా భవన అనుమతులను కమిషనర్ రద్దు చేయవచ్చు. అంతే కాదు అవసరమైన పక్షంలో కూల్చివేతలు కూడా చేపట్టవచ్చు. కానీ ఖమ్మం కార్పోరేషన్‌లో మోసపూరితమైన సమాచారం ఇచ్చి అక్రమ పద్ధతుల్లో అనుమతులు పొందిన ఇంత వరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కార్పోరేషన్‌కు పన్ను చెల్లించకుండానే ఏళ్ల తరబడి వ్యాపారాలు నిర్వహించినా తగు చర్యలు తీసుకోని కార్పోరేషన్ అధికారులు అక్రమ నిర్మాణాలు, సరైన అనుమతులు లేని నిర్మాణాలపై చర్యలు తీసుకుంటారనుకోవడం అత్యాశే అవుతుంది. ఖమ్మం కార్పోరేషన్‌లో టెక్నికల్ సెక్షన్‌లో పనిచేసే కొందరు వ్యక్తులు కార్పోరేషన్ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో పెద్ద ఎత్తున భవన నిర్మాణాలు సాగుతున్నాయి. గతంతో పోల్చినప్పుడు కాస్త మందకొడిగా సాగుతున్న నిర్మాణాలు మాత్రం నిలిచిపోలేదు. జరుగుతున్న నిర్మాణాలకు సంబంధించి సెల్ఫ్ డిక్లరేషన్‌లో తెలిపిన నిర్మాణాలకు వాస్తవ నిర్మాణాలకు ఉన్న తేడాను గమనించి చర్యలు తీసుకోవాల్సి ఉన్న తీసుకోవడం లేదని ఓ పైరవీల ముఠా కార్పోరేషన్‌లో హల్‌చల్ చేస్తుందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. అధికారుల వద్దకు భూ లేదా భవన యజమానుల కంటే పైరవీకారులే ఎక్కువగా తిరుగుతున్నారని ప్రతి ఫైలుకు ఓ రేటు కట్టి కార్పోరేషన్‌లో అనుమతులు మంజూరు చేయిస్తున్నారని సమాచారం. అక్రమమైనా, సక్రమమైనా ఈ ముఠాల ద్వారా మాత్రమే అనుమతులు వస్తున్నాయని సొంతంగా ఏ పని కోసం కార్పోరేషన్‌కు వెళ్లినా పని జరిగే పరిస్థితి లేదని ఎవరినో ఒకరిని ఆశ్రయించి ఎంతో కొంత ముట్టజెబితేనే అనుమతులు లభించే పరిస్థితి. ఒక మాటలో చెప్పాలంటే ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయం పైరవీల ముఠా వలలో చిక్కుకుంది. కాదంటే గతంలో తాము ఇచ్చిన లంచం డబ్బుల వివరాలు బహిర్గతం చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలుస్తుంది. మొత్తంగా ఖమ్మం కార్పోరేషన్‌లో కొంత కాలంగా జరిగిన భవన అనుమతుల ఫైళ్లను పునః పరిశీలన చేస్తే అనేక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. కార్పోరేషన్ ఆదాయానికి కోట్లలో గండికొడుతున్న ఈ వ్యవహారంపై కమిషనర్‌తో పాటు ప్రత్యేకాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

### ఆగస్టు 15 లోపు యాతాలకుంట

# టన్నెల్ లైనింగ్ పనులు పూర్తి చేయాలి



**-మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**-డిస్ట్రిబ్యూటరీ కాలువల భూసేకరణలో రైతులు, ప్రజాప్రతినిధులు సహకరించాలి**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఆగస్టు 15లోపు యాతాలకుంట టన్నెల్ లైనింగ్ పనులను ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సత్తుపల్లి మండలం యాతాలకుంట గ్రామంలో నిర్మాణంలో ఉన్న యాతాలకుంట టన్నెల్ ను సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు దివాకర్ టిఎస్, అంకిత్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ లను వెంట తీసుకొని మంత్రి స్వయంగా ట్రాక్టర్ నడుపుకుంటూ టన్నెల్ లోపలికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు అందించడం ఇక్కడి ప్రజల చిరకాల స్వప్నమని అన్నారు. ఏటూరు నాగారం నుంచి పాపికొండల వరకు గోదావరి పరివాహక ప్రాంతం ఉన్నప్పటికీ ఇప్పటి వరకు ఆ జలాలను వినియోగించు కోలేకపోయామని తెలిపారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఖమ్మం సరిహద్దుల వరకు వచ్చినా సిల్ట్ సమస్యలు, ఇతర ప్రాంతాల ఆయకట్టు కారణంగా జిల్లాకు నీరు అందలేదని అన్నారు.నాగార్జునసాగర్ ఎడమ కాలువ కొంత మేర ఉపశమనం ఇచ్చినా, ఖమ్మం జిల్లా ఎత్తైన ప్రాంతంలో ఉండటంతో గోదావరి జలాలను వినియోగించు కోవాలంటే లిఫ్ట్ ఇరిగేషన్ మాత్రమే మార్గమని తెలిపారు. ఎన్టీఆర్ హయాం నుంచి ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరకు ప్రతి ముఖ్యమంత్రిని ఖమ్మం జిల్లాకు లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేయాలని కోరుతూ పోరాడానని పేర్కొన్నారు. 199798లో నాగార్జున సాగర్ నుంచి శ్రీశైలం రైట్ లైన్ కెనాల్ వరకు లిఫ్ట్ పనులను రెండున్నర సంవత్సరాల్లో పూర్తి చేశామని, అదే సమయంలో దేవాదుల, దుమ్ముగూడెం లిఫ్ట్ ప్రాజెక్టులను ప్రతిపాదించామని తెలిపారు. నిధుల కొరత కారణంగా అప్పట్లో దేవాదుల ప్రాజెక్ట్ మాత్రమే ప్రారంభమైందన్నారు. వైఎస్సార్ హయాంలో దుమ్ముగూడెం ప్రాజెక్టును ఇందిరాసాగర్, రాజీవ్ సాగర్ పేర్లతో తీసుకువచ్చారని, రాష్ట్ర విభజన అనంతరం ఇందిరాసాగర్ హెడ్‌వర్క్స్ ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిపోవడంతో పాటు అవసరమైన అనుమతులు కూడా లేకపోవడంతో ప్రాజెక్ట్ ముందుకు సాగలేదని అన్నారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం అప్పటి ముఖ్యమంత్రిపై ఒత్తిడి తెచ్చి దుమ్ముగూడెం ప్రాజెక్టును ముందుకు తీసుకువచ్చామని, ఈ ప్రాంతానికి శ్రీ సీతారాములతో ఉన్న అనుబంధం కారణంగా దీనికి సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అని పేరు పెట్టామని తెలిపారు. 2016లో 13 వేల కోట్ల పరిపాలనా అనుమతులు వచ్చినప్పటికీ గత ప్రభుత్వ హయాంలో పనులు చాలా నెమ్మదిగా సాగాయని అన్నారు. 100 కిలోమీటర్ల ప్రధాన కాలువ, మూడు పంప్ హౌస్‌లు మాత్రమే పూర్తయ్యాయని, ప్రస్తుతం నాలుగో పంప్ హౌస్ పనులు కొనసాగు తున్నాయని, వాటిని పూర్తి చేస్తామని చెప్పారు. సత్తుపల్లి ట్రంక్‌లో భాగమైన యాతాలకుంట టన్నెల్ ద్వారానే ప్రధాన కాలువ నుంచి నీరు సరఫరా అవుతుందని వివరించారు.గత ప్రభుత్వం టన్నెల్ నిర్మించాలా, పైపులైన్ వేయాలా అనే విషయంలో నిర్ణయం తీసుకోలేదని, భద్రాచలం పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఒత్తిడి తీసుకువచ్చి పెండింగ్ పనులను ప్రారంభించామని తెలిపారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టుపై 10 వేల కోట్లు ఖర్చు చేశామని, మరో 7 నుంచి 8 వేల కోట్లు వెచ్చిస్తే కాలువల పనులు పూర్తి చేసి ప్రాజెక్టును పూర్తి స్థాయిలో పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు. రాజీవ్ లింక్ కాలువను ఆరు నెలల్లో పూర్తి చేశామని, వచ్చే జూన్ నాటికి గోదావరి జలాలతో వైరా ప్రాజెక్టును నింపి లక్షన్నర ఎకరాలకు సాగునీరు అందిస్తామని తెలిపారు. యాతాలకుంట టన్నెల్ లైనింగ్ పనులు ఆగస్టు 15లోపు పూర్తి చేయాలని, ఏ సమస్య వచ్చినా వెంటనే ఎమ్మెల్యేలు, కలెక్టర్ల దృష్టికి తీసుకురావాలని ఏజెన్సీకి సూచించారు. భూమి ఇచ్చిన రైతులకు మంచి పరిహారం అందిస్తున్నామని, ప్రాజెక్ట్ కోసం రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా మొత్తం 7 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని, జూలూరుపాడు టన్నెల్ పూర్తైతే పాలేరు వరకు గోదావరి జలాలు చేరుతాయని, ఖమ్మం జిల్లాలో మొత్తం 10 లక్షల ఎకరాలు సాగునీటి పరిధిలోకి వస్తాయని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసిపి వసుంధర, ప్రజా ప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులు, రైతులు అధికారులు పాల్గొన్నారు.

# రామారావు హత్య కేసు నిందితులను అరెస్టు చేయండి

**-ముఖ్యమంత్రికి సిపిఎం వినతి**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం జిల్లా చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన సిపిఎం రాష్ట్ర నాయకులు సామినేని రామారావు హత్య కేసు నిందితులను వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ సిపిఎం ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరింది. సోమవారం సిపిఎం రాష్ట్ర బృందం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. గతేడాది అక్టోబర్ 31న పాతర్లపాడు గ్రామానికి చెందిన బొర్రా ప్రసాద్, కంచుమర్తి రామకృష్ణ, మద్దినేని నాగేశ్వరరావు, కాండ్ర పిచ్చయ్య, కొత్తపల్లి వెంకటేశ్వర్లు మరి కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు కలిసి రామారావును దారుణంగా హత్య చేశారని వినతి పత్రంలో పేర్కొన్నారు. సిపిఎం రాష్ట్ర నేతగా ఉన్న సామినేని రామారావును హత్య చేస్తే తప్ప గ్రామంలో సిపిఎంను ఓడించలేమని ఈ దారుణానికి పాల్పడ్డారని వారు ముఖ్యమంత్రికి తెలిపారు. తన భర్తను హత్య చేసిన వారిని తాను స్వయంగా చూసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు స్పందించ లేదని రామారావు సతీమణి స్వరాజ్యం తెలిపారు. రామారావు రెండు సార్లు ఏకగ్రీవ సర్పంచ్‌గా పని చేశారని తాను సైతం ఒక సారి సర్పంచ్‌గా పనిచేశానని స్వరాజ్యం ముఖ్యమంత్రికి వివరించారు. రామారావును హత్య చేసిన హంతకులను, కుట్రకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కోరారు. ఈ ప్రతినిధి బృందంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, మాజీ శాసన సభ్యులు జూలకంటి రంగారెడ్డి, జ్యోతి, పోతినేని సుదర్శన్‌రావు, మల్లు లక్ష్మి , తీగల సాగర్, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు లు ఉన్నారు.

# అగ్నికి ఆహుతైన పామాయిల్ తోటలు

**(మొదటిపేజీ తరువాయి)** మద్ది మల్లారెడ్డిలకు చెందిన సుమారు 10ఎకరాల పామాయిల్ తోట పూర్తిగా దగ్ధమైంది. చేతికొచ్చిన పంట మంటల్లో బూడిద కావడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కొంత మంది రైతులకు చెందిన మోటార్లు, స్టార్టర్లు, పైపులు కూడా కలిపోవడంతో మరింత ఆర్థిక నష్టం జరిగిందన్నారు. అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని ఖమ్మం రూరల్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోట వీరభద్రం, ఖమ్మం మార్కెట్ మాజీ చైర్మన్ మద్ది మల్లారెడ్డి, మద్దులపల్లి మార్కెట్ డైరెక్టర్ తేజావత్ పంతుల్‌నాయక్ పరిశీలించి, బాధిత రైతులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో లింగా శ్రీనివాసరావు, శాబాద్ మాధవరెడ్డి, తొండల రవి, సింగిరెడ్డి బోసిరెడ్డి, సింగిరెడ్డి రాంరెడ్డి, రుద్ర ఉపేందర్, శావిడి కరుణాకర్, కొండం ప్రభాకర్, సంపేట శ్రీను, పరికపల్లి సుదర్శన్, టీం పొంగులేటి పీఎస్ఆర్ సోషల్ మీడియా వారియర్ ఆరెంపుల బద్రి సాయి తదితరులు పాల్గొన్నారు.

# సిఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే కూనంనేని, సిపిఐ రాష్ట్ర బృందం

**- పలు కీలక సమస్యలు అభివృద్ధిపై వినతి**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం నియోజకవర్గ సమగ్రాభివృద్దే ధ్యేయంగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు కోరారు. సోమవారం హైదరాబాద్ సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కూనంనేని సాంబశివరావు నేతృత్వంలోని సిపిఐ రాష్ట్ర ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. నియోజకవర్గ పరిధిలోని పలు కీలక సమస్యలు, అభివృద్ధి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ముఖ్యమంత్రికి అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటీపీఎస్ పాత ఎ,బి,సి స్టేషన్ల స్థానంలో కొత్తగా 800 మెగావాట్ల రెండు విద్యుత్ ప్లాంట్‌ను నిర్మించాలని, కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలకు కొత్త ఆర్టీసీ బస్ స్టాండ్ భవనాలను మంజూరు కోరామన్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీని ''కొత్తగూడెంపాల్వంచ మున్సిపల్ కార్పోరేషన్''గా మార్చాలని కోరామని, కిన్నెరసాని ప్రాజెక్ట్ పర్యాటక అభివృద్ధికి, హరిత రిసార్ట్, బడ్జెట్ హోటల్ ముగింపు పనులకు అదనపు నిధులు ఇవ్వాలన్నారు. ముర్రేడు వాగు రీన్‌ఫోర్డ్స్ సాయిల్ వాల్ నిర్మాణానికి రూ.50.50 కోట్లు, సింగభూపాలెం, చింతల చెరువు ఆధునీకరణకు నిధులు క్లియర్ చేయాలని, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ పంపిణీ కాలువల డిజైన్ మార్చాలని కోరారు. విద్యా, క్రీడారంగాల కోసం 20 ఎకరాల్లో సమగ్ర క్రీడా స్టేడియం, మహిళల రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీ పనులకు రూ.1160 లక్షలు, గిరిజన మహిళా డిగ్రీ కాలేజీ భవనానికి రూ.30 కోట్లు మంజూరు చేయాలన్నారు. పాలిటెక్నిక్ కళాశాల పునఃనిర్మాణానికి రూ.25 కోట్లు, సుజాతనగర్ జూనియర్ కాలేజీ, కొత్త ఐటిఐలలో సిబ్బందిని కేటాయించాలని,వైద్య సేవల్లో భాగంగా పాల్వంచ సీహెచ్‌సీని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేయాలని, జీజీహెచ్ కొత్తగూడెంలో కాత్ ల్యాబ్, ఎంఆర్ఐ స్కాన్ సౌకర్యాలు కల్పించి, పట్టణంలో ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని. జీవో నెం.76 కింద ఇళ్ల క్రమబద్ధీకరణ, పెండింగ్ పోడు భూముల పట్టాల సమస్యను పరిష్కరించాలని, ఇందిరమ్మ ఇళ్ల బిల్లులను విడుదల చేయాలని కోరామని. క్తొగూడెంలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించాలని పాస్‌పోర్ట్ ఆఫీస్, మైలారం రాగి గని పునఃప్రారంభం, పాండురంగాపురం భద్రాచలం రైల్వే లైన్ సాధన, డీఎంఎఫ్‌టీ నిధుల విడుదల అత్యంత అవసరమన్నారు. ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ రోడ్లు, వంతెనల నిర్మాణానికి, ఎంఆర్ఓ, జెడ్పీ, ఎంపీడీఓ శాశ్వత కార్యాలయ భవనాలకు నిధులు ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. చివరగా నియోజకవర్గంలోని కొత్తగూడెం, పాల్వంచ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇల్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. తాము అందించిన వినతిపత్రంలోని అంశాలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని కూనంనేని తెలిపారు.

# కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి

**ప్రజాపక్షం/కల్లూరు:** తెలంగాణ రాష్ట్రంలో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేలాది మంది సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాల జీవోలు సవరించి కనీస వేతనాలు పెంచాలని తెలంగాణ రాష్ట్ర కనీస వేతన బోర్డు తీర్మానించి రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసులు చేసి ఏడాది గడుస్తున్న పట్టించుకోకపోవడం దుర్మార్గమని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ విమర్శించారు. సోమవారం కల్లూరులో జరిగిన యూనియన్ ఖమ్మం ప్రథమ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, జిల్లా ఏరియా సామాజిక ఆరోగ్య కేంద్రాలలో పారిశుధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్వైజర్ కాంట్రాక్టు కార్మికులకు 26వేల వేతనం పెంచాలని, ఏజెన్సీల విధానం రద్దుచేసి కార్పొరేషన్ ద్వారా వేతనాలు అందించాలన్నారు. జాతీయ, పండగ, ఆర్జిత సెలవులు ఇవ్వాలని, ఒక నెల వేతనం ఆస్పత్రి కార్మికులకు బోనస్ చెల్లించాలని తదితర డిమాండ్ల సాధనకై తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ నేతృత్వంలో జరిగే ప్రతి పోరాటంలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కనీస వేతనాల జీవోలు సవరణకు నోచుకోక దాదాపు పుష్కరకాలం గడిచిపోయిందని, దీని ఫలితంగా వేలాది మంది కార్మికులు తీవ్రమైన ఆర్థిక దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషంట్ కేర్ సూపర్వైజర్ సర్వీసెస్ కోసం ప్రభుత్వం ఐహెచ్ఎఫ్ఎంఎస్ నోటిఫికేషన్ ద్వారా మూడు సంవత్సరాల కాల వ్యవధితో ఏజెన్సీలను ఎంపిక చేసే విధానం కొనసాగుతున్నదని ప్రస్తుత ఏజెన్సీల కాల పరిమిత ముగిసి ఏడాది అవుతున్న ఇప్పటికీ ప్రభుత్వం వైద్యశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ ప్రస్తుత ఏజెన్సులకే గడువులు పెంచుతూ అనుమతులు ఇస్తున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రి కార్మికులకు 26వేల కనీస వేతనం పెంచకపోతే సమ్మె తప్పదని హెచ్చరించారు. వేతనాల పెంపు పోరులో కార్మికుల పెద్ద ఎత్తున కలిసి రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, అధ్యక్షులు గాదె లక్ష్మి నారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షులు రావి శివరామకృష్ణ, రాష్ట్ర సమితి సభ్యులు నిమ్మటూరి రామకృష్ణ, జిల్లా సమితి సభ్యులు తడికమళ్ళ యోబు కుమార్, ఓడల కృష్ణమూర్తి, సయ్యద్ వజీర్ మియా, మణి రాజు, చిన్న మెడికల్ కాంట్రాక్టు అండ్ ఔట్సోర్సింగ్ వర్కర్ నాయకులు యామాల రాజు, ఇస్లావత్ వంశి, ఉండేటి ఆనందరావు, తోట పద్మ, ఇనపనూరి కుమారి, ఇరుకులపాటి పద్మా తదితరులు పాల్గొన్నారు.

# వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**-అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు రావద్దు : కలెక్టర్ దివాకర టిఎస్**



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : జిల్లాలో తీవ్ర ఎండలు, వడగాలులు కొనసాగు తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సోమవారం తెలిపారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమో దవుతున్నందున ముఖ్యంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని సూచించారు. వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల న్నారు. ఎండ తీవ్రత వల్ల వడదెబ్బకు గురయ్యే ప్రమాదం అధికంగా ఉండడంతో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తరచూ నీరు, మజ్జిగ, కొబ్బరినీళ్లు, నిమ్మరసం వంటి ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని, పుచ్చకాయ, దోసకాయ వంటి నీటి శాతం అధికంగా ఉండే పండ్లను తీసుకోవాలని తెలిపారు. బయటకు వెళ్లే సమ యంలో గొడుగు, టోపీ, తడి గుడ్డ వంటి వాటిని ఉపయోగించాలని, పలచటి లేత రంగు దుస్తులు ధరించాలని సూచించారు. వీలైనంత వరకు చెట్ల నీడలో లేదా చల్లని ప్రదేశాల్లో విశ్రాంతి తీసుకోవాలన్నారు. మద్యం, కాఫీ వంటి డి హైడ్రేషన్‌కు కారణమయ్యే పానీయాలు నివారిం చాలన్నారు. వడదెబ్బ లక్షణాలైన అధిక జ్వరం, తలనొప్పి, తల తిర గడం, వాంతులు, అలసట, చెమట ఆగిపోవడం, స్పృహ కోల్పోవడం వంటి సమస్యలు కనిపిస్తే వెంటనే బాధితులను చల్లని ప్రదేశాలకు తర లించి చల్లని నీటితో శరీరాన్ని తడపాలని తెలిపారు. ఓఆర్ఎస్ ద్రావణం ఇవ్వాలని అవసరమైతే సమీప ఆసుపత్రికి తరలించాలని సూచించారు.

# ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలి

**-ప్రజావాణిలో కలెక్టర్**



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ప్రజలు సమర్పించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమ వారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్ర మంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్లు డా॥ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వేంసూరు మండలం భీమవరంకు చెందిన కంచెపోగు సురేష్ తన కుమారుడు అభిషేక్‌కు బెస్ట్ అవెలబుల్ స్కూల్‌లో సీటు ఇప్పించాలని దరఖాస్తు చేశాడు. ఖమ్మం అర్బన్ మండలం అల్లిపురంకు చెందిన టి. భవాని తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. ఏన్కూరు మండలం తిమ్మరావుపేటకు చెందిన ఆంజనేయులు తన తాతకు సర్వే నెం. 30లో 9.38 ఎకరాల భూమి ఉండగా అందులో 4.38 ఎకరాల భూమి వేరే వ్యక్తి పేరు మీద పట్టా అయిందని అది రద్దు చేసి తమ భూమి తిరిగి ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఆయా దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ సత్వరమే చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామదీపికల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

ప్రజాపక్షం/వైరా: వైరాలో గత నాలుగు రోజులుగా నిరహార దీక్ష చేస్తున్న దీక్షా శిబిరాన్ని వైరా పట్టణంలో సోమవారం సిపిఐ ఎంఎల్, మాస్ లైన్ ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సంఘీభావం తెలిపారు. ఈ సందర్బంగా జిల్లా ఉపాధ్యక్షులు సివై.పుల్లయ్య, యలదండి బాబు మాట్లాడుతూ అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్న గ్రామదీపికలు పట్ల రాష్ట్ర ప్రభుత్వం యొక్క నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తుందని అన్నారు. వేతనాలు పెంచకపోవడంతో శ్రమ దోపిడి గురి చేస్తున్నారని, వారి యొక్క శ్రమను దోచుకుంటున్నారని వారు ఆవే దన వ్యక్తం చేశారు. వేలాది మంది గ్రామదీపికలు గత నాలుగు రోజు లుగా వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శాంతియుతంగా నిరవధిక నిరహార దీక్ష చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం నుండి ఇప్పటి వరకు కూడా స్పష్టమైన హామీ ఇవ్వకపోవడం శోచనీయమని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వారికి వేతనాలు పెంచాలని హెల్త్ పాలసీ అమలుపరచాలని సీనియారిటీ ప్రాతిపదికన గ్రామదీపికలను సిసిలుగా గుర్తించాలని అన్నారు. హెచ్ఆర్ పాలసీని కూడా అమలు చేయాలని, గౌరవ వేతనం కాకుండా వారికి రూ.20వేలు మంజూరు చేయాలని, గ్రామదీపికలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వారు



డిమాండ్ చేశారు. గ్రామదీపికల సమస్యలను పరిష్కారం అయ్యేంత వరకు సంఘీభావం మా మద్దతు ఉంటుందని ఈ సందర్బంగా పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సహాయ కార్యదర్శి కుదురుపాక దర్గయ్య, పి.వై.ఎల్ పట్టణ అధ్యక్షులు పరస బ్రద్రి, నాయకులు కన్నె గంటి అశోక్, పద్మావతి, శైలజ , ప్రభావతి, నిర్మల, మమత, తేజ, సంజు, రమాదేవి, రాధామణి, మల్లీశ్వరి, విజయలక్ష్మి, స్రవంతి, సైనాజ్ తదితరులు పాల్గొన్నారు.

# సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



ప్రజాపక్షం/ మధిర : తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క కృషితో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను సోమవారం మధిర పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పారుపల్లి విజయ్‌కుమార్, మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తలుపుల వెంకటేశ్వర్లు లబ్దిదారులకు పంపిణీచేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సమయంలో సిఎం రిలీఫ్ ఫండ్ ఎంతో అండగా నిలుస్తోందని తెలిపారు పేద, మధ్య తరగతి కుటుంబాలకు వైద్య అత్యవసర అవసరాల సమయంలో ఈ సహాయం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీ మిరియాల వెంకటరమణగుప్త, కౌన్సిలర్ బాణావత్ వెంకటరమణ నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ బిలూరి సత్యనారాయణరెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు తూమాటి నవీన్‌రెడ్డి, మైలవరపు చక్రి, షేక్.ఫయాజ్, కరీముల్లా, జమీల్‌పాష తదితరులు పాల్గొన్నారు.

# పైపులైను లీకులకు పరిష్కారం లేదా?

**-వృథాగా పోతున్న తాగునీరు**
**-గుంటలు తీయడం ఎందుకు..**
**మరమ్మత్తులు మరవడం ఎందుకు?**



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీలో త్రాగునీటి పైపులు లీకులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెలలు గడుస్తున్నా కూడా సమస్యల పరిష్కారం కావడం లేదంటూ ఆందోళన చెందుతు న్నారు. లీకులు అవుతున్న ప్రాంతాల్లో గుంటలు తీస్తున్నారు. తర్వాత మరమ్మత్తులు చేయడం మరిచిపోతున్నారు. ఇలా వైరా మున్సిపాలి టీలో గుంటలు తీసి లీకులు సరిచేయకుండా వదిలేసిన ఎన్నో ఉన్నాయి. నీరు వృధాగా పోతే ఎలా ఒక్కసారి ఆలోచించండి. మున్సిపా లిటీలోని ఒక్కో వార్డులో నాలుగు చోట్ల పైప్‌లైన్ లీకులతో నీరు వృధాగా పోతుంది. గుంటలు తీశారు. కాని ఎందుకు మరమ్మత్తులు చేయడం లేదు. దానికి కారణం ఏమిటి అనేది కూడా తెలియని పరిస్థితి. ఇలా ప్రతి వార్డులో చెప్పుకుంటూ పోతే ఎన్నో సమస్యలు లీకులతో కనిపిస్తూ ఉన్నాయి.గుంటలు తవ్విన చోట లీకులు దొరకడం లేదా లీకులు దొరకక గుంటలను అలానే వదిలేస్తున్నారా, ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు జోక్యం చేసుకొని లీకులు అవుతున్న ప్రాంతాల్లో పర్యవేక్షణ చేసి నీరు వృధాగా పోకుండా చూసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరుతున్నారు.

# వడ దెబ్బతో వ్యక్తి మృతి



ప్రజాపక్షం/మధిర : మధిర మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన భూక్య జయ రామ్(75) వడదెబ్బకు గురై మృతి చెందిన ఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది. ఆయన ఉస్మా నియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ భూక్య సైదు బాబు, భూక్య శ్రీనుల తండ్రి భూక్య జయరామ్ మృతి పట్ల కృష్ణాపురం సర్పంచ్, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, కృష్ణా పురం మాజీ సర్పంచ్ భూక్య నారాయణ, సర్పంచ్ భూక్య నాగేశ్వరరావు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. జయరామ్ పార్థివ దేహానికి నివాళులర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గ్రామంలో అందరితో సత్సంబంధాలు కలిగి ఉన్న జయరామ్ మృతి గ్రామ ప్రజలను కలిచి వేసిందని వారు పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబసభ్యులు ధైర్యంగా ఉండాలని కోరారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాపక్షం/పాల్వంచ : రెండు ద్విచక్ర వాహా నాలు ఢీకొనటంతో ఒకరు మృతి చెందిన సంఘ టన సోమవారం జరిగింది. మణుగూరు అశ్వా పురం భారజల కర్మాగారంలో సైంటిఫిక్ అసిస్టెం ట్గా విధులు నిర్వహిస్తున్న కొత్తగూడెంకు చెందిన ప్రభాత్ కుమార్ (50) తన ద్విచక్ర వాహనంపై పాల్వంచ నుండి కొత్తగూడెం వైపుకు వెళుతు న్నాడు. మరో యువకుడు తన బైక్‌పై కొత్తగూడెం నుండి పాల్వంచకు వస్తున్నాడు. ఈ క్రమంలో నవ భారత్‌లోని ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి ఎదు రుగా రెండు బైకులు బలంగా ఢీకొన్నాయి. దీనితో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థాని కులు హుటాహుటిన పాల్వంచ ప్రభుత్వ ఆసుప త్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తుండ గానే ప్రభాత్ కుమార్ మృతి చెందాడు. పూర్తి వివరాలు తెలియాల్సివుంది.

# గురుకుల పాఠశాల, కళాశాల గెస్ట్ టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

**తెలంగాణ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రమా**

ప్రజాపక్షం/వైరా: తెలంగాణ రాష్ట్ర గురుకుల పాఠశాల, కళాశాల వైరా (బాలికలు, బూర్గంపాడు(బాలికలు), ఏన్కూరు(బాలురు) నందు 20262027 విద్యా సంవత్సరంలో ఇంగ్లీష్ మీడియంలో బోధించుటకు ఖాళీగా ఉన్న గెస్ట్ టీచర్‌లుగా పనిచేయుటకు అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు చేసుకోవాలని తెలంగాణ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ బత్తుల రమ ఓ ప్రకటనలో తెలిపారు. వైరా, బూర్గంపాడు(బాలికలు) పాఠశాలకు మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు. జూనియర్ కళాశాలలో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రి, బోటనీ, జువాలజీ, సంస్కృత సబ్జెక్ట్‌లు, పిజిటి సంబంధిత పోస్టులకు డిగ్రీ, బిఈడి టెట్ అర్హతలుగా నిర్ణయించినట్లు ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను తెలంగాణ గురుకుల పాఠశాల, కళాశాల ఏన్కూరు నందు అందజేయాలని తెలిపారు. దరఖాస్తులు ఈ నెల25 నుండి 27 సాయంత్రం వరకు మాత్రమే స్వీకరించబడునని తెలిపారు. ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు దరఖాస్తులు స్వీకరించునని, ఇతర వివరాల కోసం గురుకుల పాఠశాల వైరా, ఏన్కూరు, బూర్గంపాడు ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని తెలిపారు.

# తహశీల్దార్ కార్యాలయం ఎదుట మిర్చి రైతుల ధర్నా



ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీ : మధిర పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట సాయిబాలాజీ కోల్డ్ స్టోరేజీ బాధిత మిర్చి రైతులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ ఆత్కూరులోని శ్రీ సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజిలో జరిగిన అగ్ని ప్రమాదంలో బాధిత మిర్చి రైతులకు ఇన్సూరెన్స్ అందించాలని గత కొన్నినెలలుగా సంబంధిత అధికారులు చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవటం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ దేవిద్‌కు వినతిపత్రాన్ని అందేశారు. సంఘటనాస్థలానికి మధిర సిఐ రమేష్ చేరుకుని రైతులతో మాట్లాడి ధర్నాను విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో ఇతర పోలీస్ సిబ్బంది, రైతు సంఘం నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వీఓఏలకు రూ. 26వేల కనీస వేతనం ఇవ్వాలి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** మండల కేంద్రం లోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట గత నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్న వీఓఏలకు ఏఐటీయూసీ నాయకులు మద్దతు తెలిపారు. గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్ మాట్లాడుతూ వీఓఏలకు కనీస వేతనం రూ 26వేలుగా నిర్ణయించాలని, సెర్ప్ ఉద్యోగుల మాదిరిగా పాలసీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామీణ మహిళా సంఘాలు, డ్వాక్రా సంఘాలకు రుణాల మంజూరులో వీఓఏలు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ వారికి సరైన వేతనం, ఉద్యోగ భద్రత లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. గతంలో పలుమార్లు ప్రభుత్వానికి మంత్రి సీతక్కకు వినతిపత్రాలు ఇచ్చినా సమస్యలు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో దాసం కనకలక్ష్మీ, ముదిగొండ మహాలక్ష్మీ, సంతపురి లక్ష్మీ కుమారి, తానం సత్యనారాయణ, ఈసంపల్లి విజయ్, కొదుమూరి రాధా, నారగోని విజయలక్ష్మీ, సురభి, ఆదిలక్ష్మీ, ఏలూరి దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బతో వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** మండల పరిధిలోని జగన్నాధపురం గ్రామంలో తీవ్ర ఎండల కారణంగా ఓ వృద్ధుడు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ముత్తిని నరసింహారావు(70)ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా వడదెబ్బకు గురై తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)కు తరలించారు. అయితే అత్యవసర సమయంలో డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో అక్కడి వైద్య సిబ్బంది ప్రాథమిక చికిత్స మాత్రమే అందించారు. నరసింహారావు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం వెంటనే పాల్వంచకు తీసుకెళ్లాలని సూచించారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయనకు ముందుగా పాల్వంచ, అనంతరం కొత్తగూడెంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కూడా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలోనే నరసింహారావు మృతి చెందారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మండుతున్న ఎండలు, గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర వైద్య సదుపాయాల కొరత మరోసారి వెలుగులోకి వచ్చిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## గ్రామ సమాఖ్య భవన నిర్మాణానికి భూమి పూజ



**ప్రజాపక్షం/కరకగూడెం:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ఇందిర మహిళా వారోత్సవాలు కార్యక్రమం లో భాగం గా సోమవారం కరకగూడెం మండలం లో గ్రామ సమాఖ్య భవన నిర్మాణం చేపట్టుటకు భూమి పూజలు నిర్వహించారు. చిరుమల్ల గ్రామ పంచాయతీ లోని పోలకమ్మ తోగు, రాయనపేట, రేగళ్ల గ్రామ పంచాయతీ లో భూమి పూజ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం చిరుమల్ల గ్రామపంచాయతీ సర్పంచ్ కొమరం సుగుణ, రేగళ్ల జి పి సర్పంచ్ బాడిశ సుగుణ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిడివో దేవ వర కుమార్, తహశీల్దార్ వట్టం కాంతయ్య, ఏపిఎమ్ బి. వినోద్ క్రాంతి, ఏ ఈ వెంకటేశ్వర్లు, మండల సమాఖ్య అధ్యక్షులు పోలెబోయిన సరస్వతి, జిపి కార్యదర్శులు రామకృష్ణ,త్రి నాద్, సీసీ లు విజయ లక్ష్మి, సత్యనారాయణ, మహిళా సమాఖ్య సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## పెరుగుతున్న ఎండల తీవ్రత

**ప్రజాపక్షం/మణుగూరు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పెరుగుతున్న ఎండల తీవ్రత పెరుగుతోంది. తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ (టిజిపిడిఎస్) విడుదల చేసిన రియల్‌టైమ్ వాతావరణ వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పలు మండలాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్‌కు పైగా నమోదయ్యాయి.

**అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలు..** గారిమెళ్లపాడు (చుంచుపల్లి) 46.3 సి దుమ్ముగూడెం 46.3సి మణుగూరు జీఎం ఆఫీస్ 46.3 సి అశ్వారావుపేట 46.3 సి యెల్లందు 46.2 సి లక్ష్మీ దేవిపల్లి 46.1 సి పాల్వంచ 46.0 సి భద్రాచలం 46.0 సి జిల్లాలోని అనేక ప్రాంతాలు "రెడ్ వార్నింగ్" పరిధిలోకి వెళ్లడంతో ప్రజలు అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు రావద్దని వైద్యులు సూచిస్తున్నారు.

**ఎండల తీవ్రత కారణంగా..** ఎక్కువగా నీరు తాగాలి. వృద్ధులు, చిన్న పిల్లలు జాగ్రత్తగా ఉండాలి. తేలికపాటి దుస్తులు ధరించాలి. మధ్యాహ్నం 12 నుంచి 4 గంటల వరకు బయట తిరగకుండా ఉండాలి. జిల్లాలో ఎక్కడా వర్షపాతం నమోదు కాలేదని అధికారులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండలం చిక్కుడుకుంట ప్రాంతంలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. చిక్కుడుకుంట ప్రాంతంలో ద్విచక్ర వాహనం కల్వర్టును ఢీ కొట్టగా ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. మరొకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

# వానాకాలం సాగుకు సన్నద్ధం..!



- ప్రణాళిక సిద్ధం చేసిన అధికారులు
- 6 లక్షల 37,800 ఎకరాల సాగు అంచనాలు
- అందుబాటులోనికి రాని యాప్
- నెలఖారు నాటికి యాప్ అందుబాటులోకి వస్తుంది: ఏడి

**వానా కాలం సాగుకు వ్యవసాయశాఖ సన్నద్ధమవుతోంది. యాసంగి ధాన్యం కొనుగోళ్లు దాదాపు పూర్తి కావస్తుండటంతో రైతులు వ్యవసాయ పనులు చేసేందుకు సిద్ధపడుతున్నారు. మరో పక్షం రోజుల్లో నార్లు పోసేందుకు భూములు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో 6 లక్షల 37,800 ఎకరాల్లో సాగు చేయనుండనున్నట్లు వ్యవసాయాధికారులు ప్రణాళికలు సిద్ధం చేయగా, వరి 1,75 వేల ఎకరాల్లో, పత్తి 2లక్షల10 వేల ఎకరాలు, మొక్కజొన్నలు 87 వేల ఎకరాల్లో, 1200 ఎకరాల్లో అపరాలు, మర్చి 11 వేల ఎకరాల్లో సాగు అంచనాలు వేశారు.**

**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** జిల్లా వ్యాప్తంగా ఈ వానా కాలం సీజనల్లో 6 లక్షల 37,800 ఎకరాల్లో ఎకరాలు సాగు చేస్తారనే అంచనాలను వ్యవసాయ శాఖ సిద్ధం చేసింది. ఇందులో సుమారుగా వరి 1 లక్ష 75 వేల ఎకరాల్లో, పత్తి 2 లక్షల 10 వేల ఎకరాల్లో, మొక్కజొన్న 87 వేల ఎకరాలు, వేరుశనగ 3 వేల ఎకరాలు, ఫ్రుట్ క్రాప్ 10,100 ఎకరాలు, జీడిమామిడి 12వేల ఎకరాలు, కోకో 652 ఎకరాలు, కొబ్బరి 1900 ఎకరాలు, ఆయిల్ ఫామ్ 90 వేల ఎకరాలు, మినుములు 900 ఎకరాలు, పెసలు 200,కందులు 1200 ఎకరాలు, మిర్చి 11 వేల ఎకరాలు, కూరగాయలు 800 ఎకరాలు, ఇతర పంటలు 5 వేల ఎకరాలు, ఆగ్రోఫారస్టరీ 29 వేల ఎకరాల్లో సాగుచేసే అవకాశం ఉన్నట్లు అంచనాలు కట్టారు.

### ఎరువులు, పురుగు మందులు...

వరి 1.75 లక్షల ఎకరాల్లో సాగు అంచనా ఉండగా 43750 క్వింటాళ్ల విత్తనాలు కావాల్సి ఉంది. కానీ నేటికి ఒక్క గింజ కూడా అందుబాటులోనికి రాలేదు. మొక్కజొన్న విత్తనాల పరిస్థితి కూడా ఇదే. పత్తి విత్తనాలు మాత్రం 525000 ప్యాకెట్లు కావాల్సి ఉండగా కేవలం 25000 ప్యాకెట్లు మార్కెట్లోకి అందుబాటులోనికి వచ్చాయి. అపరాలు, మిర్చి పంటలకు సంబందించి ఒక్క గింజ కూడా అందుబాటులోనికి రాలేదు. ఇదిలా ఉండగా వానా కాలం పంటలకు సంబందించి యూరియా 40625 బస్తాలు, డిఏపి 10978 బస్తాలు, ఎంఓపి 4961 బస్తాలు, ఎన్‌పికెస్ 47586 బస్తాలు, ఎస్ఎస్‌పి 4457 బస్తాలు అవసరం ఉంటుందని అంచనా వేశారు.

### అందుబాటులోకి రాని యాప్...

రైతుల కష్టాలను తీర్చేందుకు ఎరువులు, పరుగు మందుల కోసం ప్రభుత్వం యాప్ సిద్ధం చేసింది. కానీ వానా కాలం సీజన్ తగ్గరపడుతున్నప్పటికీ అది నేటికీ అందుబాటులోనికి రాలేదు. వానా కాలం సీజన్‌కు ఎరువులు సిద్ధం చేసుకుందామని రైతులు ఆశించినప్పటికీ యాప్ అందుబాటులో లేకపోవడంతో నిరాశతో ఉన్నారు. ఎకరానికి 3 నుండి 4 బస్తాల యూరియా అవసరం ఉండటంతో ముందే తీసుకుందామని రైతులు భావించారు. సీజన్ ముంచుకొచ్చిన తర్వాత యాప్ అందుబాటులోకి వచ్చినప్పటికీ రద్దీ పెరగనుండటంతో పడిగాపులు కాసే పరిస్థితి ఎదురవుతుందని రైతులు భావిస్తున్నారు.

### యాప్ నెలాఖరు నాటికి - బాబూరావు : ఏడి

రైతులకు కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాప్ ఈ నెలాఖరు నాటికి అందుబాటులోనికి రానుంది. రైతులు లైసెన్సు కలిగిన దుకాణాల్లో మాత్రమే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేయాలి. రైతులు మోసాలకు గురికావద్దు. వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడులు పొందాలి.

## పల్లె వెలుగు బస్సును ఢీకొట్టిన లారీ

-తృటిలో తప్పిన భారీ ప్రమాదం




**ప్రజాపక్షం/అశ్వాపురం:** మండలంలోని మొండికుంట వద్ద మణుగూరు, కొత్తగూడెం ప్రధాన రహదారిపై సోమవారం భారీ రోడ్డు ప్రమాదం తృటిలో తప్పింది. బిజీ కొత్తూరు, మొండికుంట మధ్య కట్టు కాలువ సమీపంలో మణుగూరు నుంచి భద్రాచలం వైపు వెళ్తున్న పల్లెవెలుగు బస్సును వెనుక నుంచి ఓ లారీ ఢీ కొట్టింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం లారీ డ్రైవర్ మద్యం మత్తులో నిర్లక్ష్యంగా వాహనం నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. అదే సమయంలో రోడ్డుపై విద్యుత్ స్తంభాలు తీసుకెళ్తున్న ట్రాక్టర్‌ను కూడా లారీ ఢీ కొట్టే ప్రమాదం దృటిలో తప్పడంతో అక్కడ ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రమాద సమయంలో బస్సులో పెద్ద సంఖ్యలో ప్రయాణికులు ఉండగా, ఢీ కొన్న ప్రభావంతో కొంత మందికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టి ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. సమాచారం అందుకున్న అశ్వాపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు. ప్రాథమిక విచారణలో డ్రైవర్ అధిక మోతాదులో మద్యం సేవించినట్లు గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనతో ప్రధాన రహదారిపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి వాహనాలు భారీగా నిలిచిపోయాయి.

## గంగాదేవి గుట్టను కాపాడాలంటూ తహసీల్దార్‌కు గ్రామస్తుల వినతి



**ప్రజాపక్షం/కారేపల్లి:** మండలంలోని గుట్టకింద గుంపు గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న గంగాదేవి గుట్టను అక్రమ మట్టి తవ్వకాల నుంచి కాపాడాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం కారేపల్లి తహసీల్దార్‌తో పాటు ఎస్ఐకు వినతి పత్రం అందజేశారు. గ్రామానికి ఆనుకుని ఉన్న గంగాదేవి గుట్ట వద్ద గోదాం పేరుతో సంబంధిత కాంట్రాక్టర్ మట్టిని అక్రమంగా తవ్వి విక్రయిస్తున్నాడని గ్రామస్తులు ఆరోపించారు. ఈ విషయాన్ని గుర్తించిన గ్రామస్తులు ఇప్పటికే పలుమార్లు మట్టి తవ్వకాలను అడ్డుకున్నప్పటికీ, కాంట్రాక్టర్ తిరిగి తవ్వకాలకు ప్రయత్నిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గంగాదేవి గుట్ట తమ గ్రామ ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీక అని తెలిపారు. గుట్టపై ఉన్న కాళికాదేవి విగ్రహం, సమ్మక్క గద్దెలు, గంగాదేవి విగ్రహాలకు సపోర్ట్ లేకుండా మట్టి తొలగించడం వల్ల అవి కూలిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తమ దైవాల పట్ల చిన్న చూపు చూస్తే సహించబోమని, ప్రజల మనోభావాలను దెబ్బతీస్తే ఎంత వరకైనా ఉద్యమిస్తామని హెచ్చరించారు. అక్రమ మట్టి తవ్వకాలను వెంటనే నిలిపివేసి, గుట్టను రక్షించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే అఖిలపక్షాల సహకారంతో నిరంతర పోరాటం చేపడతామని గ్రామస్తులు స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, లక్ష్మీ నర్సు, తోగర శ్రీను, తదితరులతో పాటు గ్రామస్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలి



-కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం
- ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం

**ప్రజాపక్షం/పాల్వంచ :** రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు సరైన మద్దతు ధరలను కల్పించటంలో పాలకులు విఫలం చెందుతున్నారని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం విమర్శించారు. వరి దాన్యానికి మద్దతు ధర పెంచాలని,రైతుల వద్ద నుండి పంటలను తక్షణమే కొనుగోలు చేయాలని, పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని, నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు.అనంతరం కేఎస్‌పి రోడ్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ సంధర్భంగా విశ్వనాధం మాట్లాడుతూ స్వామినాధన్ కమిటీ సిఫారసులను వెంటనే అమలు చేసి రైతాంగ, వ్యవసాయ రంగాన్ని పటిష్టపరచాలని కోరారు. వ్యవసాయ రంగం బలంగా ఉంటేనే అన్ని రంగాలు బాగుంటాయని అన్నారు. పంటల మద్దతు గ్యారెంటీ చట్టం అమలు చేస్తే కాని వ్యవసాయంలో రైతులు నిలబడగలుగుతారని పేర్కొన్నారు. రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయటంలో పాలకులు కుంటి సాకులు చెపుతూ ఆలస్యం చేయటం సరికాదని, తక్షణమే పూర్తి పంటలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజేపి ప్రభుత్వం పది రోజుల వ్యవధిలో నాలుగు సార్లు పెట్రోల్, డీజిల్ ధరలను విపరీతంగా పెంచుతూ సామాన్య ప్రజలపై భారాన్ని మోపుతూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నదని ఆరోపించారు. ప్రతీ ఎన్నికల సమయంలో పెట్రోల్, డీజిల్ ధరలను పెంచబోమని అబద్దాలను ప్రచారం చేస్తూ ప్రజలను నమ్మిస్తూ ఎన్నికల తరువాత నిస్సిగ్గుగా ధరలను పెంచుతూ దేశ ప్రజలను మోసం చేస్తున్నదని మండిపడ్డారు. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగాయంటూ ధరలను పెంచుతున్నామని చెపుతున్న బిజేపి ప్రభుత్వం ధరలు తగ్గినపుడు ఎందుకు ఎందుకు తగ్గించలేదని ప్రశ్నించారు. ఇప్పటికే వంట గ్యాస్ ధరల పెంపుతో సామాన్య ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పలు చిన్న టిఫిన్ సెంటర్లు, హోటళ్ళు మూతపడ్డాయని దీనితో పలువురు ఉపాధిని కోల్పోయి రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో గ్యాసు సిలిండర్, పెట్రోల్, డీజిల్ ధరలను మరింతగా పెంచి ఆయిల్ కంపెనీలకు దోచి పెట్టడానికి ఈ దేశ పాలకులు సిద్దంగా ఉన్నారని, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. లేనిచో మరింత ఇబ్బందులకు గురిచేస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం (బికేఎంయు) జిల్లా అధ్యక్షులు వీసంశెట్టి పూర్ణ చందర్‌రావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా సమితి సభ్యులు ఇట్టి వెంకటరావు, రైతు సంఘం (ఏఐకేఎస్)మండల అధ్యక్షులు కొంగర అప్పారావు, రైతు సంఘం జిల్లా సమితి సభ్యులు బదావత్ శ్రీనివాస్, రైతు సంఘం మండల నాయకులు సాయిలి శ్రీను, పోతుమర్తి కొమురయ్య, కాకటి రవీందర్, ఎస్‌కే. అమీర్, సాయిలు వెంకన్న, ఎస్‌కే. లాల్‌పాషా, అల్లి వెంకటేశ్వర్లు, వాంకుడోత్ సురేష్, భూక్యా విజయ్, బానోత్ నరేష్ పాల్గొన్నారు.

# రామగుండం-మణుగూరు కొత్త రైల్వే లైన్

-భద్రాచలం రోడ్ జంక్షన్‌గా మారే అవకాశం..!
-తెలంగాణలో రైల్వే కనెక్టివిటీని మరింత విస్తరించే దిశగా రామగుండం




**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు కొత్త రైల్వే మార్గ ప్రాజెక్ట్ కీలకంగా మారుతోంది. సుమారు 207.8 కిలోమీటర్ల పొడవుతో ప్రతిపాదించిన ఈ భారీ రైల్వే లైన్‌కు రూ.5,818 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఈ ప్రాజెక్ట్ అమలులోకి వస్తే ఉత్తర తెలంగాణ, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కొత్త దారులు తెరుచుకోనున్నాయి. ప్రత్యేకంగా మేడారం, భద్రాచలం వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలకు ప్రయాణ సౌకర్యం మరింత మెరుగుపడనుంది. ప్రస్తుతం రోడ్డు మార్గాలపై ఆధారపడుతున్న వేలాది మంది భక్తులకు రైల్వే ప్రయాణం సులభతరం కానుంది. గిరిజన గ్రామాలకు రైల్వే కనెక్టివిటీ పెరగడం వల్ల విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కూడా విస్తరించే అవకాశముంది. ఇంకా మరో ఐదేళ్లలో భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్ ప్రధాన జంక్షన్‌గా మారే అవకాశాలు ఉన్నాయని రైల్వే వర్గాలు భావిస్తున్నాయి. ఈ మార్గం పూర్తయితే హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వరకు దూరం, ప్రయాణ సమయం తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు. అదేవిధంగా సింగరేణి ప్రాంతాల నుంచి బొగ్గు రవాణా, పారిశ్రామిక అభివృద్ధికి ఈ రైల్వే లైన్ కీలకంగా మారనుంది. తెలంగాణ అభివృద్ధిలో ఇది మరో మైలురాయిగా నిలవనుందని స్థానిక ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఫోర్ వే పనులను పూర్తి చేయాలని గ్రామస్తుల ధర్నా

-కలెక్టర్ హామీతో ధర్నాను విరమించుకున్న గ్రామస్తులు







**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో ఫోర్‌వే రహదారి పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు సోమవారం భారీ రాస్తా రోకో నిర్వహించారు. సర్పంచ్ లాకావత్ లక్ష్మీ, పాలకవర్గం ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అసంపూర్తిగా ఉన్న రహదారి కారణంగా రోజూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలపడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. రహదారికి ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. వెంటనే రహదారి పనులు పూర్తి చేయాలని నినాదాలు చేస్తూ గ్రామస్తులు ఆందోళన కొనసాగించారు. ఈసందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కార్యక్రమానికి వెళ్తుండగా జిల్లా కలెక్టర్ అక్కడికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. రహదారి పనులు ఆలస్యం కావడంతో ఎదురవుతున్న ఇబ్బందులను గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కలెక్టర్ అంకిత్ త్వరితగతిని రహదారి పనులు పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. అధికారుల హామీతో గ్రామస్తులు రాస్తారోకోను విరమించారు. మండల కేంద్రానికి కీలకమైన ఈ రహదారి పనులు నెలల తరబడి నత్తనడకన సాగుతున్నాయని, అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నాణ్యతతో పనులు పూర్తి చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.




## డిమాండ్ల సాధనకు వీవోఏల సమ్మె



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** అన్నపురెడ్డిపల్లి మండలంలో వీఓఏలు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేపట్టారు. మండల కేంద్రంలో నిర్వహించిన నిరసనలో పాల్గొన్న వారు తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, నెలకు రూ 26వేల కనీస వేతనం, హెచ్‌ఆర్ పాలసీ అమలు, ఉద్యోగ భద్రత, అర్హులకు సీసీలకు ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి వీఓఏకు రూ 20లక్షల భీమా, గ్రామ సంఘాలకు ట్యాబ్‌లు, ఇంటర్నెట్ సౌకర్యం, జీవో 58 సవరణ, అధికారిక గుర్తింపు కార్డులు, జాబ్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమ్మెలో పుల్లూరి వెంకట్ గౌడ్, పి సుజా, కమల కుమారి, సత్యనారాయణ, నాగేశ్వరరావు, ఎస్‌కే అలంబి, కళ్యాణి, కృష్ణకుమారి, పుల్లారావు, బిక్షం, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో భారజల ఉద్యోగి మృతి



**ప్రజాపక్షం/అశ్వాపురం:** హెవీ వాటర్ ప్లాంట్(భారజల కర్మాగారం)లో సైంటిఫిక్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ప్రభాత్ కుమార్(38) రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైన ఘటన పాల్వంచలో విషాదాన్ని నింపింది. మృతుడు అశ్వాపురం మండలం గౌతమినగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. పాల్వంచలోని నవభారత్ సమీపంలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ఎదురుగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రభాత్ కుమార్ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మరో బైక్ అదుపు తప్పి బలంగా ఢీకొట్టడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే ప్రభాత్ కుమార్‌ను ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబానికి అండగా నిలుస్తూ ఉద్యోగ భాద్యతలు నిర్వర్తిస్తున్న యువ ఉద్యోగి ఆకస్మిక మృతితో కుటుంబ సభ్యులు, సహోద్యోగులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న పాల్వంచ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## 8వ రోజుకు చేరిన వీఓఏల సమ్మె




**ప్రజాపక్షం/అశ్వాపురం:** మండలంలోని వీఓఏలు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన సమ్మె సోమవారం 8వ రోజుకు చేరుకుంది. ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ హామీలు అమలు కాకపోవడంతో ఆవేదన వ్యక్తం చేసిన వీఓఏలు, సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ మహిళా సంఘాలు, స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నప్పటికీ తమకు సరైన గుర్తింపు, కనీస వేతనం లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. డిమాండ్లు పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని వీఓఏలు హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో గద్దల చైతన్య, గోవిందమ్మ, సుమలత, నాగమణి, కళావతి, తదితర అశ్వాపురం మండల వీఓఏలు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన తాటి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను సోమవారం అశ్వారావుపేట మాజీ ఎంఎల్ఏ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీతో మాట్లాడిన ఆయన పనుల తీరును అడిగి తెలుసుకున్నారు. వేతనాలు సకాలంలో అందుతున్నాయా, పని దినాలు సరిపోతున్నాయా అనే అంశాలపై కూలీల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఉపాధి కూలీలు మాట్లాడుతూ ఎండాకాలంలో రెండు సార్లు ఫోటో నమోదు విధానం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుటన్నామని, పని విధానాల్లో మార్పులు చేయాలని కోరారు. గ్రామంలోని సమస్యలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కూడా తాటి వెంకటేశ్వర్లుతో చర్చించారు. ఈసందర్భంగా తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పథకాన్ని విజయవంతంగా అమలు చేశామని తెలిపారు.

## నెల్లూరు శేషయ్యకు నివాళి



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని పాత మణుగూరు కు చెందిన సిపిఐ సీనియర్ నాయకులు నెల్లూరు శేషయ్య దినకర్మలు సోమవారం ఆయన స్వగృహంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీ కుమారి, సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, మాజీ ఎంపీపీ ఎడారిరమేష్, జిల్లా సమితి సభ్యులు సొందే కుటుంబరావు, ఏఐటీయూసీ మణుగూరు మండల కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు,యాకూబ్,లింగస్వామి, కనతాల కోటయ్య,యాకయ తదితరులు పాల్గొని పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

# వాగులో వెయ్యి లీటర్ల ఆయిల్ ప్యాకెట్లు



వాగులో పడేసిన గుర్తు తెలియని వ్యక్తులు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని సిద్దారం టూ నారాయణ పురం వెళ్ళే రోడ్డులో గల తమ్మిలేరు వాగులో గుర్తు తెలియని వ్యక్తులు సుమారు వెయ్యి లీటర్ల బాలాజీ బ్రాండ్ కు చెందిన ఆయిన్ ప్యాకెట్ లు, లీటర్, 3, 5లీటర్ల డబ్బాలను బ్రిడ్జీపై నుండి వాగులోకి విసిరివేసిన ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. ఆయిల్ ప్యాకెట్ లు, డబ్బాలను ఇక్కడ వేయటం పలు అనుమానాలకు తావిస్తుంది. సుమారు రూ.2 నుంచి రూ.2.5 లక్షల విలువైన ఆయిల్‌ను ఎందుకు పారబోశారు. ఎక్స్‌పైరీ డేట్ అయిపోయిన ఆయిల్ ప్యాకెట్లు అక్కడికి ఎలా చేరాయి. ఇవి ఎక్కడి నుండి తెచ్చి ఇక్కడ వేశారు. అనేవి అంతుచిక్కని ప్రశ్నలు.ఆంద్ర సరిహద్దు ప్రాంతం కావటం, చీకటి పడితే నిర్మానుస్యంగా ఉండే ప్రదేశంలో గుట్టు చప్పుడు కాకుండా అంత పెద్ద మొత్తంలో అయిల్ ప్యాకె ట్‌లను వేయాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. వసతి గృహా లు, హాస్టళ్లకు సరఫరా చేయాల్సిన సరుకును పక్కదారి పట్టించే ప్రయత్నమా లేక వేరే ఏదైనా కా రణం ఉందా అనేది తెలియాల్సి ఉంది. ఈ సరుకు ఎక్కడి నుంచి వచ్చింది, ఎక్కడికి సరఫరా కావాల్సింది. అన్న అంశాలపై అధికారుల దర్యాప్తు చేయాలని ఇటువంటి వాటిని తేలికగా తీసుకుంటే రానున్న రోజులలో ఏమైనా వ్యర్థాలు ఇలా వచ్చి చేరే అవకాశం ఉందని ఈ ఘటనపై సంబంధిత అధికారులు వెంటనే విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# ప్రజావాణి సమస్యలపై ప్రత్యేక దృష్టి

**-కమిషనర్ అభిషేక్ అగస్త్య**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజావాణిలో వచ్చిన ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ అభిషేక్ అగస్త్య పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమాన్ని కొత్త మున్సిపల్ కార్యాలయంతో పాటు బల్లేపల్లి నార్త్ జోన్ కార్యాలయంలో, పాత మున్సిపాలిటీ సౌత్ జోన్ కార్యాలయంలో, జమలాపురం కేశవరావు పార్కు వెస్ట్ జోన్, మమత రోడ్డు ఈస్ట్ జోన్ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కమిషనర్ తెలిపారు.



# చేకూరి కాశయ్య సేవలు చిరస్మరణీయం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కమ్మ మహజన సంఘం వ్యవస్థాపకులు, మాజీ జెడ్పి ఛైర్మన్, మాజీ ఎంఎల్‌ఏ చేకూరి కాశయ్య సేవలు చిరస్మరణీయమని సంఘం బాధ్యులు కొనియాడారు. సోమవారం చేకూరి కాశయ్య ఐదవ వర్ధంతిని స్వర్ణ భారతి కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి సంఘం నాయకులు, సభ్యులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు కొల్లు రఘు సత్యనారాయణ మాట్లాడుతూ చేకూరి కాశయ్య ప్రజలతో మమేకమై పనిచేసిన ప్రజానాయకుడన్నారు. రాజకీయాల్లో ఉన్నత స్థాయికి ఎదిగిన సామాన్య ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడు కృషి చేశారని కొనియాడారు. కమ్మ మహజన సంఘం అభివృద్ధికి ఆయన అందించిన సేవలు ఎప్పటికి మరువలేనివన్నారు. ప్రధాన కార్యదర్శి చావా రాము మాట్లాడుతూ చేకూరి కాశయ్య సామాజిక సేవకు ప్రతీకగా నిలిచారన్నారు. విద్య, సామాజిక, సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చేసిన సేవలు యువతకు ఆదర్శమన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షురాలు కర్నాటి రమాదేవి, సహాయ కార్యదర్శి వజ్జా శ్రీనివాసరావు, కోశాధికారి తుళ్లూరి నిర్మల కుమారి, కార్యవర్గ సభ్యులు మోతుకూరి సత్యనారాయణ, తుమ్మలపల్లి నాగేశ్వరరావు, నల్లమల ఆనంద్, మేదరమెట్ల స్వరూపరాణి, పోతినేని భుమేశ్వరరావు, కోలేటి నవీన్, నంబూరి ప్రసాద్, తాళ్లూరి మురళీకృష్ణ, బండి రవికుమార్, బత్తినేని ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి మహానాడును విజయవంతం చేయండి

**ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్ :** ఈనెల 27, 28 తేదీల్లో తెలుగుదేశం పార్టీ మహానాడును విజయవంతం చేయాలని ఖమ్మం పార్లమెంట్ టిడిపి కన్వీనర్ డా॥ వాసిరెడ్డి రామనాథం తెలిపారు. సోమవారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వాసిరెడ్డి రామనాథం మాట్లాడుతూ ఈనెల 27, 28 తేదీల్లో టిడిపి మహానాడును ఖమ్మం నగరంలోని సప్తపది ఏసి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమ విజయవంతం కోసం సన్నాహక కమిటీని కూడా ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మహానాడును జిల్లాలో విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూరపాటి వెంకటేశ్వర్లు, కేతినేని హరీష్, కాపా కృష్ణమోహన్, కొండబాల కరుణాకర్, వడ్డెం విజయ్, వనమా వాసు, చేకూరి చలపతిరావు, తాతా సుధాకర్, ఆర్‌ఎం వరలక్ష్మి , రామయ్య,



గుత్తా సీతయ్య, మీగడ రామారావు, కాట్రం స్వామి, వాసిరెడ్డి భాస్కర్ రావు, మల్లెంపాటి అప్పారావు, మందడపు సుధాకర్, రావుట్ల సత్యనారాయణ, పెనుగొండ ఉపేందర్, కిలారు సురేందర్, రాయల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# అర్బాజ్ అలీని అభినందించిన మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** తెలంగాణ పాలీసెట్ 2026 ప్రవేశ పరీక్షలో 120/120 మార్కులతో రాష్ట్ర ప్రథమ స్థానం సాధించిన విశ్వశాంతి స్కూల్ (సత్తుపల్లి) విద్యార్థి ఎం.డి. అర్భాజ్ అలీని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం ఘనంగా సత్కరించారు. అర్భాజ్ ను శాలువా, పుష్పగుచ్ఛంతో అభినందించారు. సత్తుపల్లి ప్రాంతం నుంచి తొలిసారిగా రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు రావడం గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు .మంత్రి తుమ్మల మాట్లాడుతూ చదువు మనిషి జీవితాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లే శక్తివంతమైన సాధనమని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే పట్టుదలతో ఉన్నత విద్యలో రాణించి సత్తుపల్లి ఖ్యాతిని మరింత పెంచాలని అర్భాజ్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్వశాంతి స్కూల్ యాజమాన్యం పసుపులేటి నాగేశ్వరరావు, నరుకుళ్ల సత్యనారాయణ, విద్యార్థి తండ్రి అఫ్జల్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# లైవ్ అథెంటికేషన్ ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో లైవ్ అథెంటికేషన్ ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య సోమవారం తెలిపారు. ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో సామాజిక భద్రత పెన్షన్ పొందుతున్న లబ్ధిదారుల వివరాల నిర్ధారణలో భాగంగా వారు ప్రస్తుతం ఎక్కడ నివసిస్తున్నారు, లబ్ధిదారులు జీవించి ఉన్నారా లేదా అనే అంశాలను ధృవీకరించేందుకు లైవ్ అథెంటికేషన్ ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులకు సౌకర్యవంతంగా సేవలు అందించేందుకు నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక లైవ్ అథెంటికేషన్ కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వేగవంతంగా, పారదర్శకంగా అన్ని అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. లబ్ధిదారులు ప్రత్యేక కౌంటర్‌ను వినియోగించుకుని తమ వివరాల ధృవీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.

# వేపకుంట్లలో చలివేంద్రం ఏర్పాటు




**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధిలోని వేపకుంట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ పొట్లపల్లి రమాదేవి రాజా ప్రారంభించారు. సోమవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ రమాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న వేళ ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామ ప్రజలతో పాటు పాదాచారులు, వాహనదారులు ఈ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనిల్, పాలక వర్గ సభ్యులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వివో బిల్డింగ్‌లకు శంకుస్థాపన





**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధిలోని వేపకుంట్ల, చింతగుర్తి గ్రామాల్లో స్వయం సహాయక బృందాల గ్రామ సంఘాల (వివో) భవనాలకు శంకుస్థాపన చేశారు. సోమవారం వేపకుంట్ల గ్రామంలో సర్పంచ్ పొట్లపల్లి రమాదేవి రాజా వివో భవనాలకు శంకుస్థాపన చేశారు. చింతగుర్తి గ్రామంలో సర్పంచ్ తమ్మినేని ప్రియాంక ఆధ్వర్యంలో వివో భవనాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రూ. 20 లక్షలతో స్వయం సహాయక బృందాల సభ్యులకు ఉపయోగపడేవిధంగా భవన నిర్మాణం ప్రభుత్వం నిర్మిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వేపకుంట్ల ఉప సర్పంచ్ అశ్వని, ఐకెపి సభ్యులు, చింతగుర్తి మాజీ సర్పంచ్ తమ్మిని నాగేశ్వరరావు, ఐకెపి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించిన సర్పంచ్



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం తాటిపూడి గ్రామంలో నూతన అంగన్ వాడీ భవనాన్ని సర్పంచ్ జవ్వాజి అశ్విని నాగరాజు, ఖమ్మం జిల్లా శిశు సంక్షేమ అధికారి వేల్పుల విజేత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రేస్ పార్టీ మండల కాంగ్రేస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు, జిల్లా అధికారి ప్రతినిధి పమ్మి అశోక్, తేళ్ళూరి వీరయ్య, సిడిపివో త్రిపుర బాలసుందరి, సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి , ఎంపిడివో సక్రునాయక్, ఎంఈవో చావా శ్రీను, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ నవీన్, పంచాయతీ సెక్రటరీ అజయ్, వార్డు మెంబర్లు, అంగన్‌వాడీ టీచర్, అంగన్‌వాడీ ఆయాలు, వార్డు మెంబర్లు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వివోఏలు కళ్లకు నల్ల రిబ్బన్ కట్టుకొని వినూత్న నిరసన

**నాలుగో రోజుకు చేరిన వివోఏల దీక్ష**



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** వివోఏలకు కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ వివోఏలు మే 18 నుండి సమ్మెలో భాగంగా తిరుమలాయపాలెం మండల కేంద్రంలో రిలే నిరాహార దీక్షను నిర్వహిస్తున్నారు. ఈ దీక్షకు పలు రాజకీయ పార్టీ నాయకులు సంఘీభావం తెలుపుతూ వెంటనే ప్రభుత్వం స్పందించి వివోఏల న్యాయమైన డిమాండ్లను తక్షణం అమలు చేయాలని వారి కోరారు. నాలుగో రోజు దీక్షలో వివోఏలు కళ్లు కు నల్ల రిబ్బన్ లు పెట్టుకొని విన్నత నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా అధ్యక్షురాలు వేల్పుల సుశీల మాట్లాడుతూ, ఏళ్ల తరబడి చాలీచాలని జీతాలతో ప్రభుత్వ ఒప్పంద కార్మికులుగా పనిచేస్తున్నామని ఒక్కొక్క వివోఏ కి 30 నుంచి 40 ఏళ్ల ఐకెపి లో అనుభవం ఉందని మహిళా సంఘాల ఆర్థిక అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్న వివో ఏ లకు ప్రభుత్వం కనీస వేతనం అమలు చేయట్లేదని వెంటనే వివోఏలకు కనీస వేతనం అమలు చేసి వేతనాన్ని తమ వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయాలని వివో ఏ లకు బీమా ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని 57 ఏళ్లు దాటిన వివోఏ లకు పెన్షన్లు అమలు చేయాలని హెచ్ఆర్పి పాలసీని ఇవ్వాలని వివోఏ లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని పని భారాన్ని తగ్గించాలని వారు కోరారు. పాలక ప్రభుత్వాలు తమతో వెట్టిచాకిరి చేయించుకుంటున్నాయి కానీ కనీస వేతనాన్ని అమలు చేయలేదని వాళ్ళ ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని వారి కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు వేల్పుల సుశీల, గుగ్గిళ్ళ ఉమా, కళమ్మ, బొడ్డు కుసుమ, మాధురి, మేకల కృష్ణవేణి, రమణ పద్మ కరుణ, సుజాత, మంజుల, జయ, గోపోజి ఉపేంద్ర, విజయలక్ష్మ, సిహెచ్ జ్యోతి, షేక్ జానీ, బేగం, సువర్ణ, ఉష, ఇందిరా, విజయ కుమారి, సుజాత, మంజుల, శ్రావణి, ధనలక్ష్మి, జయ, గోపోజు ఉపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారంపై అవగాహన



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** 99 రోజుల ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఆర్ ముత్తాపురం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పోషక విలువలు అధికంగా ఉన్న ఆహార పదార్థాలతో వంటల ప్రదర్శన చేపట్టి, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకునే విధానంపై వివరించారు. కార్యక్రమంలో సీడీపీవో కేంఎం తార తల్లులకు సమతుల ఆహారం ప్రాముఖ్యతను వివరించారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు తీసుకోవాల్సిన పోషకాహారం గురించి అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ కె విజయకుమారి, అంగన్వాడీ టీచర్లు పి సుమలత, పి సునీత, పి సుజాతతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## వివోల భవన నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండల పరిధిలోని గాంధీ గ్రామ సమాఖ్య, శుభోదయం రెండు వివో లకు. నూతనంగా నిర్మించనున్న వీఓఏల భవన నిర్మాణానికి సోమవారం ఘనంగా శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తాళ్లూరి రవి, ఎంపిఓ తులసీరామ్, ఏపీఎం రామకృష్ణ, సిసి రామారావు, నాగేశ్వరరావు,వివో అధ్యక్షరాలు సంధ్య, బూసమ్మ గ్రూపు సభ్యులు వివో సభ్యులు పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామానికి వివో భవనం రావడం వల్ల వివో లకి మహిళా సంఘాలకు ప్రజలకు సేవలు చేరువ అవుతాయని, భవన నిర్మాణం త్వరితగతిన, ప్రభుత్వం కేటాయించిన నిధులతో నాణ్యతా ప్రమాణాలతో భవనాన్ని నిర్మిస్తాంమని గ్రామస్తులకు అన్ని రకాల సేవలు ఒకే చోట అందుబాటులోకి వస్తాయని అని పేర్కొన్నారు.

## ఓ దుకాణంలో అగ్నిప్రమాదం

**-కుక్కర్ పేలి షాపు దగ్ధం**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండల కేంద్రం లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ దుకాణం పూర్తిగా దగ్ధమైంది. స్థానికుల కధనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండల కేందర్రంలో భూక్యా లక్ష్మి అనే మహిళ జొన్న రోట్టెలు, పండ్ల దుకాణంను నిర్వహిస్తున్నారు. సోమవారం దుకాణంలో వంట వండుతుండుగా పప్పు కుక్కర్ పేలి పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. షాపు దగ్ధమైంది. స్థానికులు మంటలను ఆర్పేందుకు నీటిని చల్లారు. కానీ మంటలు వడగాలులకు వేగంగా వ్యాపిస్తుండటంతో సాధ్యం కాలేదు. సమాచారం అందుకున్న స్థానిక ఫైరింజన్ సిబ్బంది ఘటనా స్థలం కు చేరుకుని మంటలను అదుపులోకి . తీసుకొచ్చారు. అప్పటికే దాదాపు రూ.50 వేల వరకు ఆస్థి నష్టం జరిగిందని బాధితురాలు వాపోయారు.

## కోడిసెలకుంటలో
## తృటిలో తప్పిన అగ్ని ప్రమాదం

**-అప్రమత్తమైన గ్రామస్తులు**



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మం డలం పగిడి గ్రామపంచాయతీ పరిధిలోని కోడిసెలకుంట గ్రామంలో సోమవారం భారీ అగ్ని ప్రమాదం త్రుటిలో తప్పింది. ఊరి అవతల ప్రాంతంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి వేగం గా గ్రామం వైపు వ్యాపించడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. అయితే గాలి వేగానికి మంటలు మరింత ఉధృతంగా మారి గ్రామం దిశగా దూసుకువచ్చాయి. మంటలను గమనించిన గ్రామస్తులు వెంటనే అప్రమత్తమై బకెట్లు, మోటార్ల సహాయంతో నీరు చల్లి మంటలను అదుపులోకి తెచ్చి నట్లు, గ్రామస్తుల సమయస్ఫూర్తి, ఐక్యత వల్ల పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.మంటలు మరింత వ్యాపించి ఉంటే ఇళ్లు, పశువులు, వ్యవసాయ భూములకు భారీ నష్టం వాటిల్లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు.

## గాలివాన బీభత్సం.. విరిగిపడిన చెట్లు..!



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** మండల పరిధిలోని పలు గ్రామాల్లో గాలివాన బీభత్సంతో చెట్లు విరిగి రోడ్డుకి అడ్డంగా పడి రవాణాకు అంతరాయం కలిగిన సంఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. మండల పరిధిలోని పలు గ్రామాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. ఒకవైపు రోహిణి కార్తె ప్రారంభంతో భగ్గుమంటున్న ఎండలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తుండగా, మరో వైపు ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని ఆకాశం మేఘావృతమై ఆకస్మికంగా వర్షం కురిసింది. ఈదురు గాలులు బలంగా వీయడంతో మండలంలోని వినోబా నగర్ గ్రామం వద్ద సీతారామ కాలువ వంతెన సమీపంలో ప్రధాన రహదారిపై భారీ చెట్టు విరిగిపడింది. దీంతో ఖమ్మం కొత్తగూడెం ప్రధాన రహదారిపై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొనగా, సమాచారం అందుకున్న అధికారులు చెట్టును తొలగించే పనులు చేపట్టారు.

## వీధి కుక్కల దాడిలో మహిళ మృతి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** లక్ష్మీదేవిపల్లి మండలం చేతకొండ ఎస్సీ కాలనీలో దారుణం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఎం రాములమ్మ(40)పై సోమవారం వీధి కుక్కలు ఒక్కసారిగా దాడిచేయడంతో మృతి చెందింది. కుక్కల దాడిలో తీవ్ర గాయాలపాలైన రాములమ్మ హుటాహుటిన కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆమెను పరీక్షించిన వైద్యులు శరీరంపై ఉన్న అనేక గాయాలకు ప్రథమ చికిత్సలు చేసి ప్రత్యేక వైద్యం అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతిచెందింది. దీంతో రాములమ్మ కుటుంబంతో పాటు ఆగ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. చిన్నపిల్లలపై కుక్కలు దాటి చేసి గాయపరిచిన సంఘటనలు పలు సందర్భాల్లో చూసినప్పటికీ పెద్ద వారిపై కూడా కుక్కలు దాచిచేసి చంపిన ఘటన రాష్ట్రంలో ఇదే మొదటిది. వీధి కుక్కలతో ప్రజలు తీవ్ర భయాందోళనలు చెందుతున్నారు. ప్రభుత్వం వీధి కుక్కల సంరక్షణ చర్యలు తీసుకుని వాటి భారినుండి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

## మహిళా సంఘాల అభివృద్ధికి మరో ముందడుగు

**-ఆళ్లపల్లిలో వీఓ, ఎంఎస్ భవనాలకు భూమిపూజ**



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల సాధికారత కోసం చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా ఆళ్లపల్లి మండల కేంద్రంలో వీఓ బిల్డింగ్స్, మండల సమాఖ్య(ఎంఎస్)భవనం, ఎంఎస్ గోడౌన్ నిర్మాణాలకు సోమవారం భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆళ్లపల్లి గ్రామ సర్పంచ్ వాసం సుష్మిత ఆధ్వర్యంలో మహిళా సమాఖ్య సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామీణ మహిళల ఆర్థికాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల విస్తరణకు ఈ భవనాలు ఉపయోగపడనున్నాయని నాయకులు తెలిపారు. ఈకార్యక్రమంలో వీఓ రోజా, ప్రగతి వీఓ, శ్రీ వెంకటేశ్వర వీఓ, శ్రీమంజునాథ వీఓ అధ్యక్షులు, కార్యదర్శులు, మండల సమాఖ్య అధ్యక్షులు, కార్యదర్శులు, ఏపీఓం, సీసీ, ఎన్ఆర్జీఎస్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు హాజరయ్యారు.

## మీ కోసం మేము ఫౌండేషన్ సేవా స్ఫూర్తి



**ప్రజాపక్షం/పినపాక:** మీకోసం మేము ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఓ వృద్ధునికి రూ 10వేల ఆర్థిక సహాయం అందించి గ్రామ యువత మానవత్వాన్ని చాటుకున్నారు. అత్యవసర పరిస్థితిలో సహాయం అవసరమని సోషల్ మీడియాలో సమాచారం తెలిసిన వెంటనే స్పందించిన యువకులు, దాతలు కలిసి చేయూతనందించారు. ఈసందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ వృద్ధునికి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వకం కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారం ఆ వృద్ధునికి ఎంతో ధైర్యాన్ని భరోసానను ఇచ్చిందన్నారు. ఇలాగే భవిష్యత్తులో కూడా సేవా కార్యక్రమాల్లో ముందుండి అవసరమైన వారికి సహాయం అందిస్తామని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఈకార్యక్రమంలో కొప్పుల లక్ష్మణ్, మునిగేల సంతోష్, హరీష్, రవీందరద్, ప్రవీణ్, నాగరాజు, పొనగంటి రామకృష్ణ, నాగేశ్వరరావు, పొనగంటి తేజ, రాంపండు, కృష్ణబాబు, పొనగంటి జనార్ధన్, ప్రమోద్, పోతురాజుల సాంబశివరావు, పొనగంటి రాజకుమార్, తోట ప్రభాకర్, శ్రీనివాస్, గుమ్మల లక్ష్మణ్‌తో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## రుద్రంపూర్‌లో వడదెబ్బతో వృద్ధురాలు మృతి



**ప్రజాపక్షం/చుంచుపల్లి :** తీవ్ర ఎండల ప్రభావంతో వడదెబ్బ తగిలి ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలోని రుద్రంపూర్ పంచాయతీ పరిధిలోని తిలక్‌నగర్‌లో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం దేవులపల్లి లక్ష్మి(80) రుద్రంపూర్‌కు చెందిన నివాసి ఆదివారం సాయంత్రం ఆమెకు ఒక్కసారిగా జ్వరం రావడంతోఆపటు వాంతులు, విరోచనాలు కావడంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. వెంటనే కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేయగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు తెలిపారు. ఇటీవల పెరిగిన ఉష్ణోగ్రతల నేపథ్యంలో పంచాయతీ పరిధిలో వడదెబ్బ కేసులు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే ప్రాంతంలో పంచాయతీలో పనిచేసే పారిశుద్య కార్మికుడు ఎన్.రజనీకాంత్ కూడా వడదెబ్బ కారణంగా ఇటీవల మృతి చెందడం స్థానికులను కలవరానికి గురిచేస్తోంది. వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలు అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న వేళల్లో బయటకు రావద్దని, తగినంత నీరు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

## అంగన్వాడీల్లో మహిళా వారోత్సవాలు



**ప్రజాపక్షం/భద్రాచలం :** అగన్వాడీ కేంద్రాల్లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళా వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. భద్రాచలం సెక్టార్‌లో మహిళలకు పోషకాహారంపై సిడిపిఓ జ్యోతి అవగాహన కల్పించారు. గర్భాదరణ సమయంలో ఎలాంటి పోషకాహారం తీసుకోవాలో ప్రత్యేకంగా వివరించారు. అనంతరం సిడిపిఓ మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించడమే ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. దైనందన జీవితంలో స్థానికంగా లభించే కూరగాయలు, ఆకు కూరలు, పప్పుధాన్యాలు పోషకాలతో కూడిన ఆహారాన్ని భాగంగా చేసుకోవాలని వివరించారు. తల్లులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు అనసూయ, చంద్రకళ, టీచర్లు, హెల్పర్లు, గర్భిణీలు, బాలితలు, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# వడదెబ్బతో కూలీ మృతి

**- నివాళులర్పించిన సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**
**- ప్రభుత్వం ఆర్థికసహాయం చేయాలని డిమాండ్**

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని దారేడు గ్రామానికి చెందిన సిపిఐ కార్యకర్త షేక్ ఇమామ్(45) ఖమ్మం నగరంలో రోజువారీ కూలీ పనులు చేస్తూ జీవనం సాగించేవారు. ఈ నెల 24వ తేదీన ఎండ తీవ్రతకు గురై అస్వస్థ చెందగా, రాత్రి సమయంలో ఇంటి వద్ద మృతి చెందారు. సోమవారం ఈ విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మృతదేహాన్ని సందర్శించి ఎర్రజెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేద కూలీ ఇమామ్ వడదెబ్బతో మృతి చెందడం అత్యంత బాధాకరం అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి న్యాయం చేయాలి అని డిమాండ్ చేశారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకులు



బత్తిని సీతరాములు, షేక్ నూర్జా, షేక్ మీరా, చిన్నప్ప, సుభాని, షేక్ నూరుద్దీన్, షేక్ జాఫర్, పీరుదోస్ తదితరులు పాల్గొన్నారు.

## రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల
# లబ్ధిదారుల ఎంపికలో సర్పంచుల పాత్ర ఉంటుందా...?

**-ఇందిరమ్మ కమిటీలు నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేస్తారా.?**
**మొదటి విడతలో కాంగ్రెస్ కార్యకర్తలకు దక్కిన ఇందిరమ్మ ఇండ్లు..!**

**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** తిరుమలాయపాలెం మండలంలో రెండో విడత ఇందిరమ్మ ఇండ్లలో నిజమైన పేదలకు అవకాశం కల్పించాలి గ్రామాల్లో రాజకీయాల కంటే అర్హతకే ప్రాధాన్యం ఇవ్వాలన్న ప్రజల డిమాండ్ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంలో రెండో విడత లబ్ధిదారుల ఎంపికపై గ్రామాల్లో చర్చ మొదలైంది. మొదటి విడతలో తిరుమలాయపాలెం మండలంలో 40 గ్రామపంచాయతీలలో మొత్తం 810 ఇండ్లు మంజూరు కాగా ఇందిరమ్మ కమిటీ సభ్యులు అనేక గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, అనుచరులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి ఇండ్లు మంజూరు చేశారనే ఆరోపణలు వినిపించాయి. నిజమైన నిరుపేదలు, గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాలు, అర్హులైన పేదలు పథకానికి దూరమయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండో విడత ఎంపికలో గ్రామ సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఎంతవరకు పాత్ర పోషిస్తారనే అంశంపై గ్రామాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. ఇందిరమ్మ కమిటీలు రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా నిజమైన లబ్ధిదారులను గుర్తించి ఎంపిక చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇళ్లులేని పేద కుటుంబాలు,



దివ్యాంగులు, వితంతువులు, కూలీ కుటుంబాలకు ప్రాధాన్యం ఇవ్వాలని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. మొదటి విడతలో అర్హత లేని వారు లబ్ధి పొందారని వచ్చిన విమర్శలను దృష్టిలో ఉంచుకొని ఈసారి పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మార్గదర్శకాల ప్రకారం అర్హుల జాబితాను గ్రామ సభల ద్వారా వెల్లడించి, అభ్యంతరాలు స్వీకరించి తుది జాబితా ప్రకటిస్తే వివాదాలకు తావు ఉండదని పలువురు అభిప్రాయపడుతున్నారు. నిజమైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు అందేలా అధికారులు, కమిటీ సభ్యులు బాధ్యతగా వ్యవహరించాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## గిరిజన వినతులు త్వరితగతిన పూర్తి చేయండి



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఐటిడిఏ పరిధిలోని గిరిజనుల వినతులు త్వరితగతిన పరిష్కరించాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పలు గిరిజన ప్రాంతాల నుండి తరలివచ్చిన వారి నుండి ఆయన వినతులు స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలను నమ్మకాన్ని ఒమ్ముచేయరాదన్నారు. ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రాధాన్యతా క్రమంలో అర్హులైన గిరిజన కుటుంబాల వారికి అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ యూనిట్ల అధికారులు పాల్గొన్నారు.

## భాగ్యనగర్ తండాలో
# స్త్రీ శక్తి భవనాలకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/కారేపల్లి:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్చువల్ విధానంలో రాష్ట్ర వ్యాప్తంగా 8వేల స్త్రీ శక్తి భవనాలకు శంకుస్థాపన చేయగా, సింగరేణి మండలం భాగ్యనగర్ తండాలో రెండు భవనాలకు సర్పంచ్ బానోత్ హీరాలాల్, ఎంపీడీవో మల్లెల



రవీంద్రప్రసాద్ భూమిపూజ నిర్వహించారు. ఈసందర్భంగా మహిళల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని సర్పంచ్ తెలిపారు. మహిళా సంఘాల సమావేశాలకు ఈ భవనాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సీసీ రాజేశ్వరి, పంచాయితీ కార్యదర్శి అనిల్ కుమార్, ఉప సర్పంచ్ బిక్కులాల్, వార్డు సభ్యులు గాంధీ సుమ, సంధ్య, నాయకులు భీముడు నాయక్, రాందాస్, రాంచందర్, బాబు, అప్పారావు, సెర్ప్ సిబ్బంది గౌస్ పాషా, మహిళా సంఘ నాయకులు అరుణ, బేగంకొనారి, నీలా బుజ్జి, స్థలదాతలు శంకర్, బుజ్జి, పంచాయితీ సిబ్బంది రాందాస్, హేంచంద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జూన్ 2వ తేదిన రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో నిర్వహించి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించే అవతరణ దినోత్సవం ఏర్పాట్లపై శాఖల వారీగా సమీక్షించారు. లోటుపాట్లకు తావులేకుండా వైభవంగా జరిగేందుకు చర్య తీసుకోవాలన్నారు.

## ఉచిత మజ్జిగ పంపిణీ

**ప్రజాపక్షం/పాల్వంచ :** రోజు రోజుకూ ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా ఫ్రెండ్స్ షటిల్ గ్రూప్ మరియు ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ చేపట్టారు. స్థానిక మునిసిపల్ కార్యాలయం సమీపంలో వివిధ పనుల కోసం పాల్వంచకు వచ్చే వారి దాహార్తిని తీర్చటానికి సోమవారం



సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ 40వ, డివిజన్ కార్పోరేటర్ అడుసుమిల్లి సాయిబాబ చేతుల మీదుగా మజ్జిగ చేశారు. సుమారు 200 లీటర్లు పంపిణి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, 47వ, డివిజన్ కార్పోరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు, లిటిల్ ఫ్లవర్ స్కూల్ కరస్పాండెంట్ గౌతని క్రిష్ణ, వల్లపు యాకయ్య, పునుకుల నాగేశ్వరరావు, ఆసీఫ్, రాము, విజయభాస్కర్, రహీముద్దీన్, కోచ్ అఫ్జల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఐకెపి వివోఎల సమ్మెకు ఏఐటీయూసీ సంఘీభావం

**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరులోని ఐకెపి కార్యాలయం వద్ద నిరవధిక సమ్మెకు ఏఐటియుసి సంఘీభావం సోమవారం తెలిపింది. వారి సమస్యలు వారి డిమాండ్లు న్యాయమైనవేనని వారి పట్ల రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని వారిని వెట్టిచాకి గురి చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు పిలిచి



సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర మెడికల్ కాంట్రాక్ట్ అండ్ అవుట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఎం. నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత 22 సంవత్సరాలుగా వీరిని వెట్టిచాకిరికి గురి చేస్తూ ఇబ్బందులు పాలు చేస్తుందని అన్నారు. సంఘీభావం తెలిపిన వారిలో ఏఐటిసి ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సింగ్ నరసింహారావు, జిల్లా నాయకులు రామాంజనేయులు, గాదే లక్ష్మి నారాయణ, శివరామకృష్ణ, మున్సిపాలిటీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఓడల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## అత్యాచారం కేసులో జీవిత ఖైదు

**ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ :** మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి జీవిత కాలం జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ ఖమ్మం జిల్లా ఫోక్స్ 1 ఇంచార్జి న్యాయాధికారి బి. శ్రీనివాసరావు తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2024 మే ఆరున మైనర్ బాలికకు మాయ మాటలు చెప్పి మైనర్ బాలికపై లైంగిక దాడికి బత్తుల చంద్రశేఖర్ అనే వ్యక్తి పాల్పడ్డారని ఖానాపురం హవేలీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఫోక్సో చట్టం క్రింద కేసు నమోదు చేసిన పోలీసులు నిందితున్ని అరెస్టు చేసి న్యాయస్థానంలో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయాధికారి పైవిధంగా తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరుపున పిపి జమ్ములశరత్‌కుమార్‌రెడ్డివాదించగాలైజన్‌ఆఫీసర్‌గాశ్రీనివాస్,హోంగార్డుచిట్టిబాబుసహకరించారు

## ఆగని పెట్రో పెంపు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** కేంద్ర ప్రభుత్వం ఏదో ఒక రూపంలో ప్రజలపై భారాలు మోపుతూనే ఉంది. పెట్రోల్ పెంపు నిరంతరాయంగా కొన సాగుతూ ఈనెలలో మూడవ సారి పెరిగింది. సోమవారం ఉదయం ఆరు గంటల నుంచి పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు అమల్లోకి వచ్చా యి. పెట్రోల్‌పై రూ. 2.84, డీజిల్ పై రూ. 2.86 పెంపుదల చేశారు. ప్రస్తుతం పెట్రోల్ ధర రూ.115.58, డీజిల్ ధర రూ. 113.74 గా ఉంది. రానున్న కాలంలో పెట్రోల్ ధరలు




మరింత పెరిగే అవకాశం ఉందని సమాచారం. ఇప్పటికే ధరాఘాతంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. పేదలు, దిగువ మధ్యతరగతి ప్రజలు బతకలేని పరిస్థితి ఏర్పడింది. పెట్రో ధరల పెంపుతో నిత్యావసర వస్తువుల ధరలు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.

## రోడ్డుకు మరమ్మతులు చేయండి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** మల్లేలమడుగు డబుల్ బెడ్‌రూంకు వెళ్లే రహదారులకు మరమ్మతులు చేయాలని కోరుతూ సోమవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లకు వెళ్లేందుకు సాగర్ కాలువ బ్రిడ్జి వద్ద రోడ్డు ప్రమాదకరంగా తయారైందని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. పక్కనే రైల్వేట్రాక్ ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వెంటనే మరమ్మతులు చేయాలని వినతి పత్రంలో కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బోడా వీరన్న, డబుల్‌బెడ్‌రూం నివాసులు యాకూబ్, రవి, నరేష్, నాగరాజు తదితరులు ఉన్నారు.



## కేజీబీవీ నందు సమ్మర్ క్యాంపు క్లోజింగ్ సెర్మనీ

**ప్రజాపక్షం/జూలూరుపాడుః** జూలూరుపాడు కేజీబీవీ నందు సోమవారం సమ్మర్ క్యాంపు క్లోజింగ్ సెర్మనీ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా విద్యా శాఖ అధికారిని నాగలక్ష్మి, ఏడి శంభు ప్రసాద్, డి.ఎస్.ఓ సంపత్ ఎంపీడీవో రవి, ఎంఈఓ జుంకీలాల్ ఎస్ ఓ పద్మజ



14 కేజీబీవీ ఎస్ఓస్ పాల్గొన్నారు. డిఈఓ నాగలక్ష్మి ఈ సమ్మర్ క్యాంపును ఉద్దేశించి మాట్లాడుతూ వేసవి సెలవుల్లో కేజీబీవీ పాఠశాలనందు 15 రోజులుగా పిల్లలు నేర్చుకున్న ఆల్ యాక్టివిటీస్ యోగ ధ్యానం సూర్య నమస్కారాలు స్పీడ్ మాథ్స్ స్పోకెన్ ఇంగ్లీష్ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ పెయింటింగ్ కంప్యూటర్ కోడింగ్ కరాటే గేమ్స్ ఇవన్నీ వారి యొక్క ప్రతిభను వెలికి తీస్తాయని, పిల్లల భవిష్యత్తుకు ఎంతో దోహద పడతాయని తెలిపారు. అనంతరం పాఠశాల నందు విద్యార్థులు వివిధ ప్రదర్శనల ద్వారా ఈ యాక్టివిటీస్ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, మరియు బోధన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవచూపండి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు చొరవచూపాలని అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు అన్నారు. సోమవారం ప్రజావాణిలో ఆయన జిల్లా నలు మూలల నుండి వచ్చిన వారివద్ద నుండి వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా వాటిని పరిశీలించిన ఆయన ఆయా శాఖల అధికారులకు వాటిని బట్వాడా



చేశారు. అనంతరం వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రభుత్వాధికారులపై ఉన్న నమ్మకంతో జిల్లా నలు మూలల నుండి వచ్చి ప్రజలు వినతులు సమర్పిస్తున్నారని, వాటిని సరైన పద్ధతిలో అధికారులు పరిష్కరించేందుకు చొరవచూపాలన్నారు. పరిష్కారానికి నోచుకోనివాటిపై సమగ్ర నివేదికలు త్వరంగా అందజేయాలని ఆదేశించారు.